క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



తెనాలిఅర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తోందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్వో రాంప్రసాద్ పాల్గొన్నారు.

తెనాలిలో పునః ప్రారంభమైన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

కానిస్టేబుల్‌కు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరామర్శ

తెనాలిరూరల్: ఐతానగర్‌లో యువకుల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ కన్నా చిరంజీవి కుటుంబాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ బుధవారం పరామర్శించారు. ఐతానగర్‌లోని వారి నివాసానికి వచ్చిన ఆమె చిరంజీవితో పాటు ఆయన భార్య కల్యాణితో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఆమె వెంట మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ఉన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సీడీపీవో ఎం.సునీత, సూపర్‌వైజర్ శైలజ ఇతర అధికారులు డాక్టర్ శైలజను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

వేంకటేశుడికి పుష్పయాగం



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం పుష్పయాగం ఏర్పాటు చేశారు. కొంగర జోగేంద్ర నగరాజకుమారి దంపతులు అత్యంత వైభవంగా స్వామి వారి పుష్పయాగ క్రతువును నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పరిశీలించారు.

మోసపూరిత హామీలపై కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- కూటమి ప్రభుత్వ మోసాలపై భారీ నిరసన ప్రదర్శన
- హామీల అమలుకు నినదించిన నేతలు
- సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు సాగిన ప్రదర్శన
- అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం
- ఎన్టీఆర్‌నే కాకుండా ప్రజలనూ వెన్నుపోటు పొడిచారంటూ మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే శివకుమార్



ట్యాబ్‌లో వివరాలు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నేతలు

తెనాలి: ఎన్నికల్లో మోసపూరిత హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిగా వాగ్దానాలను అమలుచేయకుండా ప్రజలను మోసగించినందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ పిలుపు ప్రకారం తెనాలిలో 'వెన్నుపోటు దినం' నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ సెంటర్ నుంచి ఆరంభమైన ప్రదర్శనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కదం తొక్కారు.

కూటమి ప్రభుత్వ వాగ్దానాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, బోసురోడ్, టౌన్‌హాల్ నుండి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ప్రదర్శన చేరుకుంది. దారిపొడవునా 'ప్రజలను వంచించిన ప్రభుత్వం', 'ఎన్నికల వాగ్దానాలను అమలుచేయాలి', 'జై జగన్' నినాదాలు మిన్నుముట్టాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నాక మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో శ్రీధర్‌బాబు, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు అందజేశారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రెట్టింపు సంక్షేమాన్ని ఇస్తామని హామీనిచ్చి ఏడాదైనా వాటి ఊసే ఎత్తడం లేదని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మండిపడ్డారు. పింఛను మినహా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అదికూడా వెరిఫికేషన్ పేరుతో చాలామంది పింఛన్లను తొలగించారని ఆరోపించారు. మరోవైపు పెరిగిన నిత్యావసరాల ధరలు, కరెంటు చార్జీలతో జనం అవస్థలు పడుతున్నారని చెప్పారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడ్ అయిన నాదెండ్ల భాస్కరరావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం తెనాలి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్నారని శివకుమార్ చెప్పారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోంచి దించేసిన చంద్రబాబు నాయుడును, పవన్ కళ్యాణ్‌ను, బీజేపీని కూటమిగా ఏర్పాటు చేసింది మనోహరేనని శివకుమార్ చెప్పారు. వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రెస్ అయిన కూటమి నేతలు, తమ మాటల్ని నమ్మి ఓటు వేసిన ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచిన చరిత్రను మూటగట్టుకున్నారని విమర్శించారు.

పౌర సరఫరాలశాఖ మంత్రి అయిన నాదెండ్ల మనోహర్ తెనాలిలో ఉచిత సిలెండర్ల పథకానికి అర్హులు ఎందరు? ఎందరికి సిలెండర్లు మంజూరయ్యాయి. వారిలో ఎందరికి డబ్బులు ఖాతాల్లో పడ్డాయో.... తెలియజేయాలని కోరారు.

ప్రదర్శనలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్, కొల్లిపర మండల అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కళ్లం వెంకటప్పారెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, బూరెల నాంచారమ్మ, కొర్రయశోద, మంజరి, చింకా సురేష్‌యాదవ్ మాట్లాడారు. భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, బొంతు నరేంద్రరెడ్డి, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, గోల్డ్ రహిమా, జొన్నల శివారెడ్డి, బొల్లిముంత పోతురాజు, పిల్లి గంగాధర్, మన్నవ ప్రభాకర్, కొడాలి క్రాంతి, కాకి దేవసహాయం, మంద్రు రాజు, ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, కౌన్సిలర్లు కుర్రా సుజాత, యాతాటి అనిల్, ఆవుల కోటయ్య, పెదలంక లక్ష్మీలావణ్య, కావటి నిర్మల, బ్రదర్ ఆనందన్న, మన్నవ శాంతిశ్రీ, కాళిదాసు వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, షేక్ మీరావలి, సయ్యద్ గౌస్, అక్కిదాసు కిరణ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నాదెండ్ల భాస్కరరావుపైనా కేసు పెడతారా?

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్‌ను, చంద్ర బాబుపై వేర్వేరు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలను మీడియాకు వినిపించారు శివకుమార్. సోషల్ మీడియాలో పోస్టులతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ చేసిన ఫిర్యాదులపై ఎందరినో అరెస్టు చేసిన ప్రభుత్వం, భాస్కరరావు వ్యాఖ్యలపై ఎవరైనా ఫిర్యాదుచేస్తే ఆయనపై కూడా కేసు పెడతారా? లేక వదిలేస్తారా? అని ప్రశ్నించారు.

శిథిలావస్థకు చేరిన వంతెనపై నుంచే ప్రయాణిస్తున్న వాహనాలు



ప్రయాణించాలంటే ధైర్యం కావాలి!

- శిథిలావస్థలో కఠెవరం పడమర కాల్వ పైవంతెన
- వణికిపోతున్న వాహనదారులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం పడమర కాల్వపై వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం వందలాది వాహనాలు వంతెనపైగుండా గ్రామంలోకి వస్తుంటాయి పోతుంటాయి. బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు ద్విచక్ర వాహనాలతో ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. దాదాపు 10 వేల జనాభా కలిగిన గ్రామంలో నిత్యం రాకపోకలు ఈ రహదారి మీదుగానే వెళ్లవల్సిన పరిస్థితి అయితే గత కొంతకాలంగా రహదారి వంతెన శిథిలావస్థకు చేరడంతో తరచుగా వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక గుర్తు తెలియని వాహనాలు వంతెన రైలింగ్‌ను ఢీకొనడం వలన ఇరువైపులా విరిగిపోయి వంతెన దాదాపుగా ధ్వంసమైంది. వంతెన పరిస్థితి పట్టించుకున్న అధికారి లేరని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వంతెనకు ఇరువైపులా రైలింగ్ విరిగిన దృశ్యం

మందు బాబులపై కేసు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై తాడేపల్లి పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఖాజావలి మాట్లాడుతూ.. కృష్ణానది తీర ప్రాంతం, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మందు బాబులు మద్యం తాగుతున్నారని.. వారిని అదుపు చేసేందుకు డ్రోన్ కెమెరా ఉపయోగించి గుర్తిస్తున్నామని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి, తాడేపల్లిలో చిరువ్యాపారం చేసుకునే వారికి మంత్రి నారా లోకేష్ సహకారంతో బుధవారం తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధిలు మాట్లాడుతూ అద్దె భారంతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతో రెండు తోపుడు బండ్లు, ఒక ప్లాట్‌ఫామ్ రిక్షా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, తాడేపల్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

3వ రాష్ట్ర కౌన్సిల్ సభలను జయప్రదం చేయాలి

దుగ్గిరాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని ఏపీ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాల చంద్రమౌళి కోరారు. ఈ సందర్భంగా దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న సభలో ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్పీలకు అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న ఆర్పీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మున్సిపల్ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ల్యాప్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అందరూ తమ బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని.. సంపాదనలో 20 శాతం తప్పకుండా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ సేవల కోసం ఇతరులపై ఆధార పడకూడదని అన్నారు.

ల్యాప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. మెప్మా పట్టణ కమిటీ ఆర్గనైజర్ పద్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి బ్యాంకు సేవలను మన పరిసర ప్రాంతాల్లో అందరికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్త విప్పర్ల విజయ భాస్కర్, ల్యాప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు రాణి, విజయకుమారి, రమాదేవి, దుర్గా ఇంద్రాణి, నాగేశ్వరరావు, శౌరయ్య, వివిధ సంస్థల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌పై కేసు నమోదు

మంగళగిరి టౌన్: ఓ వ్యాపారిపై దౌర్జన్యం చేసి బెదిరించిన కేసులో బండారు రవి అలియాస్ బక్కరవి అనే రౌడీషీటర్‌ను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి సదరు రౌడీషీటర్‌ను జైలుకు పంపినట్లు సీఐ వినోద్ కుమార్ బుధవారం తెలిపారు. రౌడీషీటర్లను అడ్డం పెట్టుకుని నగర పరిధిలోని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

దుగ్గిరాల: సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆధార్ క్యాంపులను ఈనెల 10వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆధార్ క్యాంపులలో చిన్న పిల్లలకి కొత్తగా ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ నవీకరణ, మార్పులు, చేర్పులు సరిచేసుకోడానికి వీలు కలుగుతుందని అన్నారు. దుగ్గిరాల సచివాలయం, మోరంపూడి సచివాలయంలో 10, 11వ తేదీల్లో.. సచివాలయం, రేవేంద్రపాడు నార్త్-4 అంగన్వాడీ కేంద్రంలో 12, 13 తేదీల్లో .. సచివాలయం, పేరుకలపూడి సచివాలయంలో 24వ తేదీన క్యాంపులు ఉంటాయన్నారు. పెదపాలెం సచివాలయం, కె.ఆర్. కొండూరు ఎలిమెంటరీ పాఠశాలలో 25వ తేదీన.. చిలుపూరు సచివాలయం, పెదకొండూరు సచివాలయంలో 26న.. చిలువూరు సచివాలయం, గొడవర్రు సచివాలయంలో 27న క్యాంపులు నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదర్శ నేత కన్నెగంటి


- జీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా దీర్ఘకాలం రైతుసేవ
- రైతు రుణాల్లో చెక్కులను ప్రవేశపెట్టిన ప్రయోగం
- స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి వైదొలగిన ఆదర్శం
- సమాజ సేవలో గడిపిన మానవతావాది
- నేడు శతజయంతి సందర్భంగా



కన్నెగంటి రెడ్డమ్మచౌదరి

తెనాలి: ఉన్నత వ్యక్తిత్వం, రాజకీయం... ఈరెండూ పరస్పరం వ్యతిరేకం. మంచి మనసు కలిగిన వారు రాజకీయాల్లో ఇమడటం కష్టం అంటారు. ఇందుకు భిన్నంగా రాజకీయాల్లో ఉంటూనే ఆదర్శంగా పనిచేసి, చేయదగిన ప్రజాసేవ చేసి ప్రశంసలు అందుకున్న నాయకులు అరుదు.

తెనాలికి చెందిన మానవతావాది కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి ఈ కోవలోకి వస్తారు. వ్యక్తిగా, రాజకీయనేతగా జీవితకాలం నిబద్ధతతో ప్రజాసేవ చేశారు. రాజకీయాలనుంచి స్వచ్ఛందంగా వైదొలగారు. పేదవిద్యార్థులు, నిరుద్యోగులు, క్రీడాకారులకు ఆర్థికసాయం చేశారు. విద్యాసంస్థలు, దేవాలయాలు, ప్రార్థనామందిరాలకు తోడ్పాటునిచ్చారు. విద్యావ్యాప్తికి, ఆధ్యాత్మిక భావనల పెంపునకు దోహదపడ్డారు.



అమరవీరుల స్థూపాల ప్రారంభోత్సవంలో నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డితో రెడ్డమ్మచౌదరి

స్వస్థలం నందివెలుగే!

కన్నెగంటి రెడ్డమ్మచౌదరి స్వస్థలం రూరల్ మండల గ్రామం నందివెలుగు. 1925 జూన్ 5న ధనిక రైతుకుటుంబంలో జన్మించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో జ్యూరీగా పనిచేసిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి మనవడే ఈయన. తాత పేరిటే నామకరణం చేశారు. తండ్రి వల్లభరావు సమీపంలోని 20 గ్రామాల ప్రజలకు తలలో నాలుకలా ఉండేవారు. రెడ్డమ్మ చౌదరి పెదతండ్రి స్వాతంత్ర్యయోధుడు, తామ్రపత్రగ్రహీత కన్నెగంటి సూర్యనారాయణమూర్తి చౌదరి. స్వరాజ్య ఉద్యమంలో ఏడేళ్ల జైలుజీవితం గడిపారు. రాయవెల్లూరు జైలులో ఖైదీల హక్కుల కోసం పోరాడారు. రాజాజీచే 'యంగ్ చౌదరి ఆఫ్ గుంటూరు జిల్లా' అనిపించుకున్నారు. తాత, పెదనాన్న స్ఫూర్తితో రెడ్డమ్మచౌదరిలో చిన్ననాటనే ఆదర్శభావాలు మొగ్గతొడిగాయి. ఎస్ఎస్ఎల్‌సీ తర్వాత, రాజకీయ రంగంవైపు అనివార్యంగా అడుగులు వేశారు.

ప్రకాశం జిల్లాతో సహా కలిగిన నాటి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా 1962లో ఎన్నికయ్యారు. రెండు దఫాలు ఆ పదవిలో కొనసాగారు. రైతుసేవలో పలు ప్రయోగాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టారు. సొసైటీల నుంచి రైతులకు రుణాలను నగదు రూపంలో ఇస్తుండటంతో అవినీతికి ఆస్కారం కలుగుతోందనే భావనతో చెక్కుల రూపంలో ఇచ్చే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. రైతు సేవలో పార్టీలకు అతీతంగా పనిచేసి రైతుల అభిమానాన్ని గెలుచుకున్నారు.

తర్వాత కాలంలో రాజకీయాల స్వరూపం మారుతుండటాన్ని పసిగట్టిన రెడ్డమ్మచౌదరి తనకు తానుగానే రాజకీయాల నుంచి విరమించుకున్నారు. స్థానిక జేఎంజే మహిళా కాలేజీ స్థాపనకు ఎంతో కృషిచేశారు. తాను స్వయంగా భూరివిరాళం ఇవ్వటమే కాకుండా అవసరమైన నిధుల సమీకరణకు, అనుమతుల సాధనకు తోడ్పడ్డారు. డబుల్ ఒలింపియన్ కామినేని ఈశ్వరరావు 1952 హెల్సింకి ఒలింపిక్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికసాయం అందించారు.

సాహిత్యాభిమాని!

సాహిత్యాభిలాష కలిగిన రెడ్డమ్మ చౌదరికి తెలుగుభాషపై ఎనలేని మమకారం. కాకతీయుల ఆడపడుచు, విజయనగర సామ్రాజ్య పట్టమహిషి గంగాదేవి రచించిన 'మధురా విజయం' అనే సంస్కృత గ్రంథాన్ని 600 సంవత్సరాల తర్వాత రెడ్డమ్మచౌదరి తెలుగులో అనువదింపజేశారు. డాక్టర్ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి అనువదించిన 'సుభద్ర ధనంజయము' గ్రంథానికి కృతికర్త కూడా రెడ్డమ్మ చౌదరి.

ఉన్నతమైన వ్యక్తిత్వం

ఉన్నత వ్యక్తిత్వంతో రాజకీయాల్లో, ప్రజాసేవలో గడిపిన ఆయన, సతీమణి అన్నపూర్ణదేవి ఎన్నో దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించారు. వీరికి పదిమంది సంతానం. అందరూ ఉన్నత విద్యావంతులు. 2005లో రెడ్డమ్మచౌదరి, 2011లో అన్నపూర్ణదేవి మృతిచెందారు. వీరిద్దరి పేర్లతో శ్రీకన్నెగంటి రెడ్డమ్మచౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి వీరి కుమారుడు రామరాయచౌదరి వివిధ సామాజిక సేవలను అందిస్తున్నారు.